కథ

# పనికిరాని సలహా

అది ఏప్రిల్ నెల. ఎండలు మండిపోతున్నాయి. బస్సుకోసం ఎదురుచూస్తున్న సోమశేఖరం మాస్టారు గడియారం వంక చూసాడు జేబులోని దస్తీ తీసి ముఖానికున్న చెమట తుడుచుకుంటూ. సమయం రెండుగంటలు దాటింది.

ఒంటిపూట బళ్ళు చాలైనప్పట్నుంచి పట్టణాల్లో ఉంటూ పల్లెల్లో ఉద్యోగాలు చేసే పంతుళ్లు గమ్యం చేరాలంటే మండుటెండల్లో బస్సులకోసం ఈ మాత్రం ఇక్కట్లు పడటం పరిపాటి. అతుకుల బొంతలాంటి ఆర్టీసి బస్సు అల్లంతదూరం నుండి రావడం గమనించిన మాస్టారు అంతదాకా పడ్డ శ్రమను ఇట్టే మరిచిపోయాడు. స్టేజి వద్ద బస్సు ఆగడమే తరువు..జనాన్ని తోసుకుంటూ వెళ్ళి నుంచున్నాడు.

ఎవరో ఒక అబ్బాయి లేచి ''రండి సార్ ఇక్కడ కూర్చుందురుగాని'' అంటూ లేచి సీటివ్వడంతో తన గురుభక్తిని మెచ్చుకొని ఈరోజుకు నా ప్రాణం నిలబెట్టావురా బాబూ అనుకుంటూ వెళ్లి ఆ కిటికీ పక్క సీట్లో కూర్చున్నాడు. పావుగంట ప్రయాణం తర్వాత పెద్ద మోతతో బస్సాగింది. అప్పటికే నిద్రలోకి జారుకున్న మాస్టారుగారు ఒక్కసారిగా ముందుకు తూలిపడి లేచి చూసాడు. అప్పుడర్థమయిందతనికి అది బ్రేకు వేస్తే వచ్చిన మోత అని, అక్కడో స్టేజి ఉందని. అదివరకే క్రిక్కిరిసిన ప్రయాణికుల్తో నిండి ఉన్న బస్సులోకి జనం తోసుకుంటూ ఎక్కేస్తున్నారు. బస్తాల్ని, చిన్న చిన్న మూటల్ని, గంపల్ని పట్టుకొని మరీ ఎక్కేస్తున్నారు. ఆరోజు పక్కగ్రామంలో సంత అని తెలుసుకోవడానికి ఇంకా ఎంతో సమయం పట్టలేదు. రోజుకు నాలుగేసి ట్రిప్పులు కొట్టే ఈ బస్సును చూస్తే జాలేస్తుంది. అరమైలు దూరం ప్రయాణించిందో లేదో-

ఇంతలో మళ్లీ బస్సాగింది. ఉక్కపోతకు తట్టుకోలేక పిల్లలు ఏడుపు లంకించుకున్నారు. మాస్టారుగారు కిటికీలోంచి తల బయటకు పెట్టి చూసారు. స్టేజయితే రాలేదు 'ఎందుకని ఆపినట్టు' అన్న సందిగ్ధంలో ఉండగా 'టికెట్, టికెట్' అంటూ ముచ్చెమటలు పట్టిన కండక్టర్ అసహనంగా ప్రయాణికుల్ని చేధించుకుంటూ వెనుకవైపు రావడం గమనించిన మాస్టారు 'టికెట్ ఇష్యూ కాబోలు!' అనుకొని చేతిలో ఉన్న పేపర్లో తల దూర్చాడు. ఉక్కపోతతో దాదాపుగా అందరి శరీరాలు తడిసిపోయాయి.

''ఏ..ఇగనన్న పోనియ్యరాదయ్య డైవర్‌సాబు పొల్ల గండ్లు నీల్లకేడ్తంద్రు ఎండకాలం దినం'' ఉక్కపోతకు తట్టుకోలేక అంది ఓ అరవై ఏళ్ల అవ్వ. తాము తీసిన సినిమా అతి కష్టంమీద వందరోజులు పూర్తిచేసుకుని శతదినోత్సవం జరుపుకునేలా చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుకున్న దర్శక నిర్మాతల్లా ఎట్టకేలకు టికెట్లు తీసుకొని బస్సు కదిలేందుకు సహకరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ 'రైట్' చెప్పేసాడు కండక్టరు బాబు.

తలకు మించిన భారంలా ఉందా బస్సు పరిస్థితి. నెలలు నిండి గర్భవతిలా, కప్పను మింగిన పాములా మెల్లగా బయలుదేరింది బస్సు. పది నిమిషాలు ప్రయాణించిందో లేదో మళ్లీ ఆగింది. ప్రయాణికుల సహనానికి ఆర్టీసీవారి పరీక్ష కాబోలు. మళ్లీ ఏమయినట్లు టికెట్ ఇష్యూ కానే కాదు స్టేజి అంతకన్నాకాదు. డ్రైవర్ కిటికీ తీసి గబాల్న కిందికి దూకి బస్సుకిందికి వంగి చూస్తున్నాడు. కండక్టర్ కూడా దిగాడు. డ్రైవర్ బస్సు నడవదు అందర్నీ దిగమన్నట్లు చెబుతున్నాడు. ఎక్కేటప్పుడు ఉన్న చురుకుదనం దిగేటప్పుడు ఉండదు కాబోలు. ప్రయాణికులు ముల్లేమూటతో దిగేసరికి సరిగ్గా పది నిమిషాలు పట్టింది. చిట్టచివరగా దిగాడు వాళ్లతో పోటీపడి తోసుకుంటూ దిగలేని మాస్టారు. టైము వంక చూసాడు పావు తక్కువ మూడు.

ఇంకా రెండుగంటలయినా బస్సులేని ఆ రూటు, మూడుకిలోమీటర్లు వెళ్లినారాని గమ్యం తలుచుకుంటేనే భయమేస్తుంది. తోటి ప్రయాణికులు మాత్రం తమకిదేమీ కొత్తకాదన్నట్లు, ఇంకా కొంతమంది వృద్ధులయితే ''ఆ దేవుడిచ్చిన ఈ రెండు కాళ్లుండగా మనకేం కొదవ. అయినా మనం చిన్నప్పుడు బస్సుల్లోనే ప్రయాణించామా ఏంటి'' అన్న లెవల్లో అంతటి ఎండని కూడా లెక్కచేయకుండా ఎవరిమూట వారు నెత్తినెత్తుకొని ఎవరి దారిన వారు నడచి వెళ్తున్నారు.

★★★

''ఏవండీ అన్నం వడ్డించాను రండీ'' అన్న భార్యకేక వినిపించగానే స్నానం చేసొచ్చి అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటున్న మాస్టారు గబగబా వెళ్లి కూర్చున్నాడు. ఆకలి దంచేస్తోంది కాబోలు. భోజనం చేస్తున్న మాస్టారు ప్రక్కనే కూర్చుంది భార్య కూడా. ''ఏమండి ఈరోజు క్రిక్కిరిసిన జనం మధ్య ప్రయాణం, మండుటెండలో మీరు పడ్డ ఆ శ్రమ తలచుకుంటేనే నా గుండె తరుక్కుపోతుంది.

''అసలు సంగతేంటి?'' ఆమె చెప్పబోయే విషయం సగం అర్థమయిందతనికి.

''ఏది ఏమైనా మనకో స్కూటరుండాలండీ''

''ఈ విషయం పెళ్లైనప్పట్నుంచీ చెపుతున్నావుగా''

''అందుకే ఇంత తొందరగా కొన్నారు'' అంది వ్యగ్యంగా.

పూర్తిగా అన్నం తినడంలోనే మునిగిపోయాడు మాస్టారు.


''అదికాదండి ఇకమీదట స్టేజీల వద్ద గంటలకు గంటలు బస్సులకోసం పడిగాపులు గాయక్కరలేదు. కష్టంగా ఆ బస్సు ప్రయాణాలు చేయక్కర్లేదు. సెలవు రోజు ఏ సినిమాకో సర్కస్‌కో వెళ్లాలన్నా ఈ ఆటోలతో సరిపెట్టుకునే అవసరమూ లేదు. మనూరెళ్ళాలంటే ఎంచక్కా అనుకున్న సమయానికే వెళ్లొచ్చు, రావచ్చు'' ఎట్టకేలకు భోజనం మొదలయినప్పట్నుంచి అయిపోయేలోపు భారతాన్ని ముగించేసింది. మాస్టారు మనసులో స్కూటర్ కొనే ఆలోచనలొస్తున్నాయి. కాని నోటి నుంచి మాత్రం సమాధానం రావటం లేదు. పాడిందే పాటరా పాసిపండ్ల దాసరి అన్నట్లు రోజూ పాడే పాటే కదా. అయినా స్కూటర్ కొనుక్కోమని మావాళ్ళిచ్చిన డబ్బుల్నే బ్యాంకులో దాసేసాడు. ఈయన స్కూటర్ కొనడమేంటి. నీ పిసినారితనం మండిపోను. ఈ జన్మలో స్కూటర్ కొనలేడు మనసులోనే అనుకుంటూ టేబుల్‌పై ఉన్న కంచాన్ని తీసి శుభ్రం చేసే ప్రయత్నంలో మునిగిపోయింది ప్రభావతి.

భోం చేసి ఈజీ కుర్చీలో కూర్చున్న మాస్టారుకు రోజూ అనే తన భార్య మాటలకన్నా తను ఆరోజుపడ్డ నరకయాతనే పదే పదే గుర్తుకురాసాగింది.

ప్రభావతి రోజులాగే స్కూటర్ అడిగిందిగాని, తన భర్తకు స్కూటర్ కావాలనే ఆలోచన కలిగి తన మనసును స్కూటర్ షోరూం వైపు పరుగులు తీస్తుందని గుర్తించలేకపోయింది.

ఒక రాష్ట్రంలో ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పనిచేయటంలో విఫలమైనప్పుడు ఆ ప్రభుత్వాన్ని, శాసనసభను రద్దు చేసి తన పాలనను విధిస్తూ రాష్ట్రపతి తీసుకున్న కీలక నిర్ణయంలా స్కూటర్ కొనాలనే నిర్ణయాన్ని ఎట్టకేలకు తీసేసుకున్నాడు. తన మొలతాడుకు కట్టుకున్న తాళం చెవిని తీసి బీరువా తెరిచి భార్యకు తెలియకుండా దాచిన ఐదు వేల రూపాయల కట్టని గబగబా జేబులో కుక్కుకొని

భోం చేసి ఈజీ కుర్చీలో కూర్చున్న మాస్టారుకు రోజా అనే తన భార్య మాటల కన్నా తను ఆరోజుపడ్డ నరకయాతనే పదే పదే గుర్తుకురాసాగింది. ప్రభావతి రోజు లాగే స్కూటర్ అడిగిందిగాని, తన భర్తకు స్కూటర్ కావాలనే ఆలోచన కలిగి తన మనసును స్కూటర్ షోరూం వైపు పరుగులు తీస్తుందని గుర్తించలేకపోయింది.



భార్యకు చెప్పి వెళ్దామనుకున్న అతనికి మనసులో చిన్న ఆలోచన రావడంతో ఆగిపోయాడు. ''ఏకంగా బండితో వచ్చినరోజే తెలుసుకోవాలి అప్పుడే థ్రిల్'' చెప్పకుండానే వెళ్ళిపోయాడు.

★★★

కళకళలాడే మోముతో వెళ్లిన మాస్టారు కళావిహీనమైన మోముతో గుమ్మంలో అడుగుపెట్టాడు. ''ఎటెళ్లారండి ఇంతసేపూ. కనీసం చెప్పయినా వెళ్ళొచ్చుగా'' దండెంపై బట్టలు ఆరేస్తున్న భార్యమాటలు వినగానే 'థ్రిల్' అన్నమాట గుర్తొచ్చింది. వెళ్లేటప్పుడు భార్యతో చెప్పకుండా ఒక మంచిపని చేసాన్రా దేవుడా అనుకుంటూ ''పిల్లలేరి'' అప్రయత్నంగా అడిగాడు. అప్పటిదాకా ప్రకాశవంతంగా వెలిగి, ఉన్నట్టుండి లోవోల్టేజి వల్ల డిమ్ అయిన బల్బులా మారిపోయిందతని ముఖం.

''పక్కింటి రామానందం అన్నయ్య కూలర్ కొనుక్కొచ్చాడట. చల్లగా ఉందిట వాళ్ల పిల్లల్తో మనపిల్లలూ అక్కడే పడుకున్నారు.''

''ఏంటి. రామానందం ఏంటి కూలర్ కొనడమేంటి ఏ వస్తువు కొన్నా నన్ను తీసుకెళ్ళేవాడు. కనీసం చెప్పనైనా చెప్పలేదు'' అంటూ చొక్కా తీసి మొలకేసాడు. ''ఏం మాస్టారుగారు ఎటెళ్ళారండీ గంటసేపటికి పైగా మీకోసం చూసి ఉండబట్టలేక నేనే వెళ్ళి కూలర్ కొనుక్కొచ్చానండి''

''అదేంటండి నిన్ననే కదా ఇంటి ఓనరు అద్దె అడిగితే డబ్బుల్లేవని చెప్పి బ్రతిమాలి పంపించారు.''

''ఔనండి అది నిన్నటి విషయం.''

''బజారుకెళ్లి కూరగాయలు తెస్తుంటే వీధి మలుపు వద్ద ఐదువేల రూపాయలు దొరికాయండి''

''అలాగాండి'' సంతోషం ఆపుకోలేక ఏదో చెప్పబోయాడు మాస్టారు.

అతని మాటలేమీ వినిపించుకోకుండా ''ఎండాకాలం కదా పిల్లలు వేడికి అల్లాడిపోతున్నారు. అందుకే ఆ డబ్బుల్తో కూలర్ కొనుకొచ్చా. పోయిన సంవత్సరం వాళ్ల నాన్న కూలర్ కొనుక్కోమని డబ్బులిస్తేనే మీ చెల్లాయి పాప పేర ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించింది. ఈ డబ్బు దొరికాయని చెబితే ఏ పోస్టాఫీసులోనో, బ్యాంకులోనో వేయమని ఉచిత సలహా ఇస్తుంది. అందుకే మీ చెల్లాయితో చెప్పకుండా డబ్బులు తీసుకొని నేరుగా మీ యింటికే వచ్చాను. మీరెటెళ్లారో తెలీదని చెల్లాయి చెప్పడంతో గంటసేపు వేచి చూసి ఒకడినే వెళ్లాను. రాత్రయితే షాపు కట్టేస్తారు కదా! మళ్లీ రేపు ఆదివారం. సామాను ధరచేయడం నాకు రాదుగాని వంద అటు వంద ఇటుపైగా దొరికిన డబ్బేనాయె. మనమేమన్నా కష్టపడి సంపాదించామా''

ఎన్నాళ్లనుంచో కూడబెట్టిన చిల్లర చితకా డబ్బుని పక్కింటివాడి కూలర్ రూపంలో చూడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు మాస్టారు. ''ఈ ఆలోచన రావడానికి కారణం మీరేనండి. ఇంతకుముందోసారి మన లొకాలిటీలో మీకు వెయ్యి రూపాయలు దొరికినపుడు పోలీస్ స్టేషన్‌లో ఇద్దామంటే వాళ్లకిస్తే మనకేంటి లాభం. దొరికిన డబ్బుతో జ్ఞాపకార్థం ఏదో ఒక వస్తువు కొనుక్కోవాలని చెప్పారు గుర్తుందా? ఆరోజు దొరికిన డబ్బుతో మీరు ఫ్యాన్ కొని ఇంట్లోవాళ్లని థ్రిల్ చేసారు కదా! ఇపుడు నేనూ అదే చేసాను. ఆ విషయం నా ఒక్కడికి తప్ప మరెవ్వరితోనూ చెప్పలేదన్నారు. ఇప్పుడీ విషయం మీతో తప్ప మరెవ్వరితోనూ చెప్పడంలేదు. చెప్పను కూడా'' జరిగిన సంఘటనను ఘంటాపథంగా చెప్పేసి వెళ్లిపోయాడు రామానందం ఆనందంగా.

తను ఉన్నంతసేపూ పైకి సంతోషాన్ని పులుముకొని లోలోపల బాధని నింపుకొని ఉన్న మాస్టారు అతను వెళ్లిపోగానే పెద్ద నిట్టూర్పుతో కుర్చీలో కూలబడిపోయాడు. దీర్ఘాలోచనలో పడిపోయాడు. మాస్టారు ఇప్పుడు తను ఈరోజు పారేసుకున్న డబ్బుగురించి కాదు. ఆరోజు పారేసిన తప్పుడు సలహా గురించి ఆలోచిస్తున్నాడు.

★

ఎం.శ్రీనివాస్